జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శుక్రవారం | 23-08-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 107 పేజీలు: 8 వెల : రూ.7



# దువ్వాడ..
# ఔట్

* వైసీపీ టెక్కలి నియోజక వర్గ ఇన్‌చార్జి పదవి నుంచి తొలగింపు
* మళ్లీ సమన్వయకర్తగా పేరాడ తిలక్ నియామకం
* కుటుంబ కలహాల నేపథ్యంలో జగన్ నిర్ణయం




**శ్రీకాకుళం/టెక్కలి, ఆగస్టు 22 (వార్త):** టెక్కలి వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌కు ఎదురుదెబ్బ తగిలింది. సమన్వయకర్త పోస్టు నుంచి తొలగిస్తూ వైసీపీ అధిష్టానం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. మళ్లీ పేరాడ తిలక్‌కు టెక్కలి ఇన్‌చార్జీగా నియమించింది. గత కొద్ది రోజులుగా దువ్వాడ కుటుంబ కలహాలు తారాస్థాయి చేరుకున్న విషయం తెలిసిందే. కుటుంబ కలహాలు తగ్గుముఖం పట్టలేదు.. సరికాదా రోజుకో ట్విస్టులపై ట్విస్టుల పరంపర సాగుతోంది. దువ్వాడ కుటుంబ కథా చిత్రం వల్ల పార్టీ పరువు మంటగలిసింది. టెక్కలి నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలు ఊసేలేదు. కుటుంబ కలహాలతో దువ్వాడ శ్రీనివాస్ కేవలం ఇంటికే పరిమితమైపోయారు. కార్యకర్తలకు అండగా ఉండాల్సిన వారంతా తలోదిక్కులా మారిపోయారు. ముందుండి నడిపించే నాథుడే లేకపోవడంతో పార్టీ అధిష్టానం గట్టి నిర్ణయం తీసుకుంది. టెక్కలి నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త బాధ్యతల నుంచి దువ్వాడ శ్రీనివాస్‌ను తొలగించింది. ఆ స్థానంలో గత ఎన్నికల్లో పార్లమెంట్ స్థానానికి పోటీచేసిన పేరాడ తిలక్‌కు అప్పగించింది.



## మాజీ స్పీకర్ తమ్మినేనిపై..
# ఎమ్మెల్యే రవి ఫిర్యాదు

* నకిలీ సర్టిఫికెట్ వ్యవహారంపై ప్రధాన కార్యదర్శికి ఫిర్యాదు
* సీఐడీచే విచారణ చేయించాలని వినతి
* గతంలో ఇదే విషయమై రచ్చరచ్చ




ఆమదాలవలస, ఆగస్టు 22 (వార్త): మాజీ స్పీకర్ తమ్మినేని నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారం మళ్లీ చర్చకొచ్చింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో సీతారాం నకిలీ సర్టిఫికెట్లతో లా చేసినట్టు అప్పట్లో కూన రవికుమార్ బహిరంగ విమర్శలు చేశారు. దీనిపై సుప్రీంకోర్టు, హైకోర్టు చీఫ్ జస్టిస్‌తో పాటు రాష్ట్రపతికి కూడా ఫిర్యాదు చేశారు. దీనిపై మీడియాలో కూడా అనేక కథనాలు వచ్చాయి. దీనిపై అప్పటి స్పీకర్ తమ్మినేని సీతారాం మౌనం దాల్చారే తప్ప మీడియా ముఖంగా కూడా ఎక్కడా మాట్లాడలేదు. ఇదే విషయమై రాష్ట్ర వ్యాప్తంగా చర్చ సాగింది. దీనిపై ఎటువంటి విచారణ కూడా జరిగిన దాఖలాలు లేవు. ప్రస్తుతం ప్రభుత్వం మారింది. ఈసారి ఎన్నికల్లో సీతారాం ఓటమి పాలయ్యారు. ఆయన మేనల్లుడు కూన రవికుమార్ ఆమదాలవలస ఎమ్మెల్యేగా గెలుపొందారు. గురువారం మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారంపై ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. అమరావతిలోని సచివాలయంలో నీరబ్ కుమార్‌ను కలిసి సీతారాం నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారంపై సీఐడీచే దర్యాప్తు చేయించాలని కోరారు. తమ్మినేని సీతారాంపై తాను 2022 సంవత్సరం నుంచి ఇదే విషయమై పోరాటం చేస్తున్నానన్నారు. అప్పట్లో స్పీకర్‌గా వ్యవహరిస్తున్న తమ్మినేని సీతా రాం నకిలీ సర్టిఫికెట్ల పైన సుప్రీంకోర్టు, హైకోర్టు చీఫ్ జస్టిస్‌లకు, రాష్ట్రపతికి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ప్రస్తుతం సీఐడీ విచారణ జరిపించి నిజాలను నిగ్గుతేల్చాలని రవికుమార్ కోరారు. ఆయన వెంట తూర్పుకాపు సాధికార కమిటీ కన్వీనర్ పల్లి సురేష్ ఉన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం


## వినాయక చవితికి సిద్ధమవుతున్న గణనాథులు

గార, ఆగస్టు 22(వార్త): వినాయక చవితి వేడుకలు సమీపిస్తుండడంతో ప్రథమ గణపతిగా పూజలను అందుకోవడానికి గణనాథులు సిద్ధమవుతున్నారు. గార మండలంలోనే కాకుండా జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల వినాయక విగ్రహాల తయారీ ప్రారంభించారు. పీవోపీ విగ్రహాలు, పేపర్ లైట్ వెయిట్ విగ్రహాల తయారీలో వ్యాపారస్తులు నిమగ్నమయ్యారు. వివిధ రూపాల్లో వినాయకుడిని రెండు అడుగుల నుంచి, ఇరవై అడుగుల ఎత్తు గల విగ్రహాలను తయారు చేస్తున్నారు. ఇప్పటికే వివిధ రూపాల్లో సిద్ధమైన విగ్రహాలు చూసేవారికి కనువిందు చేస్తున్నాయి.



# జాబ్ కార్డులు తీసివేశారేం?

**ఉపాధి హామీ అధికారులను నిలదీసిన సంతబొమ్మాళి సర్పంచ్ లక్ష్మి**

**సాఫీగా మండల సర్వసభ్య సమావేశం**

సంతబొమ్మాళి, ఆగస్టు 22 (వార్త): సంతబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మేరుగు రాజేశ్వరి అధ్యక్షతన గురువారం సర్వసభ్య సమా వేశం సాఫీగా జరిగింది. సంతబొమ్మాళి పంచాయతీలో సుమారుగా 200మంది జాబ్‌కార్డులు తీసివేశారని సర్పంచ్ కళింగపట్నం లక్ష్మి ఉపాధిహామీ అధికా రులను నిలదీశారు. ఇరిగేషన్ శాఖపై సభ్యులు లేవనెత్తిన అంశాలపై పూర్తి స్థాయిలో సమాధానం రాలేదు. డీజీ పురం పీహెచ్‌సీ వైద్యుడు సుధీర్ మాట్లాడుతూ మండలంలోని నాలుగు పీహెచ్‌సీల్లో పాముకాటు, కుక్కకాటు టీకాలు ఆరు నెలలకు సరిపడా ఉన్నా యన్నారు. వెలుగు అధికారులు మాట్లా డుతూ పీఎంఈజీ పథకం కింద రూ.లక్ష నుంచి పది లక్షల వరకు సబ్సిడీపై లోన్లు మంజూరవుతున్నా యని తెలిపారు. గ్రామస్థాయిలో చిన్న కుటీర పరిశ్రమలకు ప్రోత్సహించేం దుకు 18 నుంచి 50 ఏళ్ల మధ్య వారు బ్యాంకులు ద్వారా రుణాలు పొందవచ్చ న్నారు. తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఓటర్ నమోదుకు ఇం టింటా సర్వే చేస్తున్నట్లు చెప్పారు. శాశ్వత భూహక్కు చట్టంపై సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి పరిష్కరిస్తామని తెలిపారు. స్థలాలు చూపిస్తే అంగన్ వాడీలకు నూతన భవనాలు మంజూరు చేస్తున్నట్లు ఐసీడీఎస్ అధికారులు తెలి పారు. 2014 నుంచి 2019 మధ్యలో ఇల్లు నిర్మించి ఒక రూపాయి బిల్లు పడిన ఇళ్లకు సంబంధించిన వివరా లను ప్రత్యేక యాప్ ద్వారా సేకరిస్తు న్నట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలి పారు. గ్రామీణ ఉపాధిహామీ పథకంపై అధికారులు వివరణ ఇస్తూ ఇప్పటివ రకు 50శాతం పనిదినాలను కల్పించి, వేతనదారులకు బిల్లులు పెండింగ్ లేకుండా జమ చేసినట్లు చెప్పారు. ఎరు వులు, డీఏపీలు అందుబాటులో లేవని సభ్యులు నిలదీయగా, మూడు రోజుల్లో అందుబాటులోకి తెస్తామని వ్యవసాయ అధికారి సురేష్ తెలిపారు. ఎంఈవో చిన్నవాడు మాట్లాడుతూ బడి బయట పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పిం చాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీ టీసీ సభ్యుడు పాల వసంత రెడ్డి, ఎంపీ డీవో ప్రేమలీల, వైస్ ఎంపీపీలు తుల సమ్మ, చింతామణి, వివిధ శాఖల అధి కారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచు లు తదితరులు పాల్గొన్నారు.




ఉపాధి హామీ అధికారిని నిలదీస్తున్న సంతబొమ్మాళి సర్పంచ్ లక్ష్మి



## సబ్ జైలును పరిశీలించిన సివిల్ జడ్జి

నరసన్నపేట, ఆగస్టు 22 (వార్త): జిల్లా న్యాయాధికారి సేవా సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి సన్యాసినాయుడు గురువారం ఆకస్మికంగా నరసన్నపేట సబ్ జైలును సందర్శించారు. ముద్దాయిలతో సమావేశమయ్యారు. మౌలిక వసతులు ఎలా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. జైలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వచ్చే నెల 14న మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తామని, సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## దహన సంస్కారాలకు నీటి సదుపాయం



ఆమదాలవలస రూరల్, ఆగస్టు 22 (వార్త): బొబ్బిలిపేటలోని శ్మశానవాటికలో నీటి సదుపాయం లేక గ్రామస్తులు అవస్థలు పడుతుండడంతో సర్పంచ్ రమణ మూర్తి చొరవతో గురువారం బోరుబావిని తవ్వించారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తంచేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు చింతాడ అప్పారావు, పంచాయతీ సెక్రటరీ బి.పూర్ణిమ, వార్డు మెంబర్ గొండు రమణ, గ్రామస్థులు పాల్గొన్నారు.

# మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలి



మందస, ఆగస్టు 22(వార్త): మహి ళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలని సెర్ప్ ఏపీఎం గొడబ ప్రసాదరావు పిలుపునిచ్చారు. మందస మండల సమాఖ్య కార్యాలయంలో గురువారం వీవోఏలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ ఈ ఏడాది 100రోజుల యాక్షన్ ప్లాన్ లక్ష్యాన్ని వీవోఏలు, సీసీలు పూర్తి చేయా లని సూచించారు. పొటెన్సియల్ లక్ పతి దీదీలో ఏ కార్యక్రమాలు చేయాలో, ముఖ్యఉద్దేశం వివరించారు. గ్రామా ల్లో తయారయ్యే ఉత్పత్తుల ఆన్‌లైన్ మార్కెటింగ్‌కి ఓపెన్ నెట్‌వర్క్ ఆఫ్ డిజి టల్ కామర్స్ ఉపయోగపడుతుందని సూచించారు.

కార్యక్రమంలో స్త్రీనిధి మేనేజర్ కరిమి సాయిరాం, సీసీలు, ఎంఎస్ అధ్యక్షురాలు కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు రక్త పరీక్షలు



సంతబొమ్మాళి, ఆగస్ట్ 22 (వార్త) : కొల్లిపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం బోరుభద్ర పీహెచ్‌సీ వైద్యాధికారి అవని ఆధ్వర్యంలో రక్త పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### అతిథి అధ్యాపక పోస్టులకు

## దరఖాస్తుల ఆహ్వానం

నరసన్నపేట, ఆగస్టు 22 (వార్త): నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళా శాలలో అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సి పాల్ సురవరపు సత్యనారాయణ తెలి పారు. ఎంపీహెచ్ డబ్ల్యూ, ఈఈటీ కోర్సుల్లో ఒక్కో ఖాళీ ఉన్నాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసు కోవాలని సూచించారు.

## వ్యాధులపై అప్రమత్తం

నరసన్నపేట, ఆగస్టు 22(వార్త): వాతావరణ మార్పులతో సంభవిస్తున్న వ్యాధులపై అప్రమత్తంగా వ్యవహరిం చాలని ఉర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.అరవింద్ తెలిపారు. జ్వరాలు వచ్చి నప్పుడు వెంటనే దగ్గరలో ఉన్న ప్రభు త్వాసుపత్రికి వెళ్లాలని సూచించారు. ఏమాత్రం అశ్రద్ధ చేసినా ప్రాణాలకే ముప్పు ఉంటుందని హెచ్చరించారు.

## విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

మందస, ఆగస్టు22(వార్త): మందస మండలంలో శు క్రవారం విద్యుత్ సం ఫరాలో అంతరాయం ఉంటుందని ఎగ్జి క్యూటివ్ ఇంజనీర్ పి.యోగేశ్వరరావు, అసిస్టెంట్ ఇంజనీర్ ఎల్.యోగి తెలి పారు. మందస, హరిపురం 11కేవీ ఫీడర్స్‌కు ఆనుకుని ఉన్న చెట్లు, కొమ్మ లు తొలగిస్తామన్నారు. మందస, హరి పురంలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నామని, వినియోగదారులు గమనించి సహరించాలని కోరారు.

## నాసిరకం ఎరువులు, క్రిమిసంహారకాలు విక్రయాలు

నరసన్నపేట, ఆగస్టు 22 (వార్త): రైతులకు విక్రయిస్తున్న ఎరువు నాణ్యమైనదా? నకిలీదా? తెలియక పలువురు తికమక పడుతున్నారు. నరసన్నపేట పట్టణంలో ఎరువులను పురుగుమందులను క్రయవిక్రయాల దుకాణదారులు వాటి నాణ్యతను తెలిపే నిర్ధారణ పట్టికలు ఏర్పాటు చేయడం లేదు. వ్యవసాయ అధికారులు తనిఖీలు నామమాత్రంగా నిర్వహించడం. తనిఖీలు సమయంలో సరుకు నిర్ధారణ చేయకపోవడం. గోడౌన్లో ఉన్న సరుకు పై సరైన వివరాలు అమ్మకము దారుల వద్ద లేకపోవడం. రైతులకు విక్రయించే ఎరువులు క్రిమిసంహారక మందులకు రసీదులు అందజేయకపోవడం పరిపాటుగా మారింది. ఉన్నతాధికారులు దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

## మొక్కలు నాటిన ఎంపీపీ

ఇచ్ఛాపురం, , ఆగస్టు 22 (వార్త): ప్లాంట్ ఫర్ మదర్ కార్యక్రమంలో భాగంగా ఎంపీపీ బోర పుష్ప టి.బరంపురం పంచాయతీ పరిధిలోని కె.శాసనం, పి.శాస నం గ్రామాల్లో గురువారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కారింగి త్రినాథరెడ్డి, కారంగి మోహనరావు, కృష్ణారెడ్డి, మామయ్య, నూకయ్య, ఆనంద్, చిట్టిబాబు, కేదారి ఫీల్డ్ అసిస్టెంట్, మేట్‌లు పాల్గొన్నారు.



## బడి బయట పిల్లలను పాఠశాలల్లో చేర్చండి

నరసన్నపేట, ఆగస్టు 22(వార్త): బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి, ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చాలని ఎంఈవో పేడాడ దాలినాయుడు సూచించారు. గురువారం నరసన్నపేట ఎంఆర్సీ కార్యాలయంలో సీఆర్ఎంటీ వెల్ఫేర్ సహాయకులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో డ్రాపౌట్స్ ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు. వీరిని పాఠశాలల్లో చేర్చే ప్రక్రియకు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## చల్లపేటలో మొక్కలు నాటిన డ్వామా పీడీ

జలుమూరు, ఆగస్టు 22 (వార్త): జలుమూరు మండలం చల్లవానిపేట, లింగాలవలస గ్రామాల్లో గురువారం లో గురువారం డ్వామా పీడీ చిట్టిరాజు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పర్యావరణానికి మేలు జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని సూచించారు, కార్యక్రమంలో సోమేశ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## వరుదు బాబ్జీ సేవలు శ్లాఘనీయం



సారవకోట, ఆగస్టు 22 (వార్త): సారవ కోట మండలం అలుదు గ్రామానికి చెందిన ప్రముఖ పారి శ్రామికవేత్త వరుదు బాబ్జీ విగ్రహాన్ని ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, ఎమ్మెల్యే గొండు శంకరరావు ఆవి ష్కరించారు. జాతీయ రహదారికి ఆనుకుని వారి స్వగృహం దగ్గర ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాబ్జీ సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బగ్గు లక్ష్మణరావు, వంశీకృష్ణ, దేవీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి



నరసన్నపేట, ఆగస్టు 22(వార్త): వరి సాగులో యాజమాన్య పద్ధతులను పాటిస్తే, అధిక దిగుబడులు సాధించవచ్చని ఏడీ రవీంద్రభారతి సూచించారు. గురువారం తామరపల్లిలో పొలంబడి నిర్వహించారు. కలుపు నివారణకు వ్యవసాయ అధికారులు సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏవో సునీత, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## పురపాలక సంఘ కమిషనరుగా బాలాజీ



ఆమదాలవలస, ఆగస్టు 22(వార్త):ఆమదాలవలస పురపాలక సంఘం కమిషనరుగా పూజారి బాలాజీ ప్రసాద్ నియమితులయ్యారు. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనికుమార్ సింఘాల్ రాష్ట్ర వ్యాప్తంగా 24 మంది కమిషనర్లకు బదిలీ చేశారు. ఇందులో భాగంగా ఆయన ఇక్కడ త్వరలో బాధ్యతలు చేపట్టనున్నారు. ఈయన ఏడేళ్ల క్రితం ఇక్కడ పారిశుధ్య విభాగ అధికారిగా బాధ్యతలు నిర్వహించి, పాలకొండ కమిషనరుగా పదోన్నతిపై వెళ్లారు.

## ఓటర్ల జాబితా సవరణకు సహకరించాలి



నరసన్నపేట, ఆగస్టు 22(వార్త): ఓటర్ల జాబితా సవరణను రాజకీయ పార్టీల ప్రతినిధులు విజయవంతం చేయాలని తహసీల్దార్ ఆర్.రామ్మోహన్‌రావు సూచించారు. ఈ మేరకు ఆయన నరసన్నపేట తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనవరి నాటికి 18 ఏళ్లు నిండిన వారిని నమోదు చేయాలని సూచించారు.

## నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన

జలుమూరు, ఆగస్టు 22 (వార్త): చల్లవానిపేటలో గురువారం జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వ ర్యంలో విశాఖ సెంటర్ ఫౌండేషన్ సౌజన్యంతో సర్పంచ్ పంచ రామచంద్ర రావు సహకారంతో ఈ శిబిరం నిర్వహించారు. చికిత్స కోసం ఎంపికైన వారిని విశాఖ ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో సహాయ అధికారిని జాషన్, కోఆర్డినేటర్ సునీల్‌కుమార్ పాల్గొన్నారు.



# మొక్కల పెంపకం సామాజిక బాధ్యత

సంతబొమ్మాళి, ఆగస్టు 22 (వార్త): సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవా లను సందర్భంగా జిల్లాలో పది వేల మొక్కలు నాటడానికి సంకల్పించినట్లు శ్రీసత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్య క్షుడు సూర రామచంద్రరావు తెలి పారు. గురువారం వారు నౌపడ ప్రాథ మిక ఆరోగ్య కేంద్రంలో మామిడి,కాగు, వేప, మారేడు, తురాయి తదితర మొక్కలు 108 నాటారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్లు పెంచడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్య త అన్నారు. పర్యావరణ పరిరక్షణ, వాతావరణంలో ఆక్సిజన్‌శాతం పెంపు, భూతాపాన్ని తగ్గించడానికి విరివిగా మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నౌపడ ప్రాథమిక ఆరో గ్య వైద్యాధికారులు నందిని, పరిమళ, జిల్లా ఇన్‌చార్జి బి.చంద్రమౌళి, జిల్లా డిజాస్టర్ మేనేజ్మెంట్ ఇన్‌చార్జి మల్లేశ్వర రావు, జిల్లా స్టడీ సర్కిల్ ఇన్‌చార్జి ఎం. నారాయణమూర్తి, టెక్కలి జోనల్ కన్వీ నర్ చంటి, కన్వీనర్ మురళీకృష్ణ, సేవా దళ్ లలిత, అన్నపూర్ణమ్మ, దుర్గమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



# గ్రామ సభలను విజయవంతం చేయండి

జలుమూరు, ఆగస్టు 22 (వార్త): ప్రతి పంచాయతీలో శుక్రవారం నిర్వహించే గ్రామసభలను విజయవంతం చేయాలని ఎంపీపీ వాన గోపి పిలుపునిచ్చారు. జలుమూరు ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఎన్‌ఆర్‌ఆజీఎస్, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి పనులను గుర్తించి గ్రామసభలో తీర్మానం చేయాలని సూచించారు.

**గార:** కళింగపట్నం గ్రామ సచివాలయంలో శుక్రవారం ఉపాధి హామీ పనులపై సర్పంచ్, ఎంపీటీసీ, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు సమక్షంలో గ్రామ సభను నిర్వహించనున్నట్లు సచివాలయ సెక్రటరీ బి.కిశోర్‌కుమార్ తెలిపారు. ఫీల్డ్‌అసిస్టెంట్లు, వీఆర్‌ఏలు, జాబ్ కార్డు దారులందరూ ఈ సభకు హాజరుకావాలని ఆయన కోరారు.

**సారవకోట:** గ్రామస్థాయిలో శుక్రవారం నుంచి జరిగే గ్రామసభల్లో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ పిలుపునిచ్చారు. గ్రామాల అభివృద్ధి కోసం ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు

**బూర్జ:** డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు శుక్రవారం నిర్వహించనున్న గ్రామ సభలకు జనసేన కార్యకర్తలతో పాటు ప్రజలంతా అధిక సంఖ్యలో పాల్గొనాలని బూర్జ మండల అధ్యక్షుడు కొత్తకోట నాగేంద్ర, జిల్లా కార్యదర్శి కోరుకొండ మల్లేశ్వర రావు, ప్రధాన కార్యదర్శి కొల్ల జయ రాం, అంపిలి విక్రం పిలుపునిచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న జలుమూరు ఎంపీపీ వాన గోపి



## సీఐకి అభినందనలు తెలిపిన టీడీపీ నాయకులు

ఇచ్ఛాపురం, ఆగస్టు 22 (వార్త): ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సీఐ మీసాల చిన్నంనాయుడును పలువురు తెలుగుదేశం నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. వీరిలో 17వ వార్డు తెలుగుదేశం ఇన్‌చార్జి జన్నెల సంతోష్ యాదవ్ తదితరులు ఉన్నారు. అనంతరం సీఐ పురుషోత్తపురం చెక్ పోస్ట్ వద్ద జాతీయ రహదారిపై హెల్మెట్ తనిఖీలు నిర్వహించారు. కౌన్సెలింగ్ ఇచ్చారు.

## మందసలో పెద్దజీయర్ పుట్టినరోజు వేడుకలు


మందస, ఆగస్టు 22(వార్త): మందసలోని వాసుదేవస్వామి ఆలయంలో పెద్దజీయర్ స్వామి తిరునక్షత్రం సందర్భంగా పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రత్యేక ఆరాధన, శతనామార్చన ఆలయ ప్రధాన అర్చకులు, గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని భక్తులు దర్శించుకుని, తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు.



## నిత్యావసర సరుకుల..

# గిడ్డంగిని కొనసాగించాలి

సారవకోట, ఆగస్టు 22 (వార్త): సారవకోట మండల కేంద్రంలో నిత్యావసర సరుకుల గిడ్డంగి ఏర్పాటు చేయాలని పలువురు డీలర్లు, స్థానిక నేతలు కోరుతున్నారు. గతంలో ఇక్కడి నుంచి మండలంలోని ఉన్న అనేక డిపో లకు సరకులు సరఫరా అయ్యాయని వారు తెలిపారు. ఐదేళ్ల క్రితం ఇక్కడి గిడ్డంగిని ఎత్తివేసి, 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న జలుమూరులో కలప డంతో ఈ ప్రాంత డీలర్లకు అసౌకర్యం ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ గిడ్డంగిని మళ్లీ ఇక్కడే ఏర్పాటు చేయాలని వారు కోరారు.




ఐదేళ్ల నుంచి మూసి ఉన్న నిత్యావసర సరుకుల గిడ్డంగి

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక





## క్షతగాత్రుడికి ఆదుకున్న భగత్ సింగ్ ట్రస్ట్

**కొత్తూరు, ఆగస్టు 22 (వార్త):** భామిని మండలంలోని సతివాడ గ్రామానికి చెందిన నెల్లి శంకర్ గత ఫిబ్రవరి నెలలో బిల్డింగ్ సెంట్రింగ్ పనులు చేస్తుండగా గాయపడ్డారు. దీంతో అతని రెండు కాళ్లు దెబ్బతిన్నాయి. వైద్యం కోసం ఉన్న డబ్బు మొత్తం ఖర్చు అయి నిస్సహాయిక స్థితిలో ఉన్నట్టు భగత్ సింగ్ ట్రస్ట్ గమనించింది. శంకర్ రావు కుటుంబానికి అండగా ట్రస్ట్ సొంత ఖర్చుతో ఒక మినీ కిరాణా దుకాణం ఏర్పాటు చేసి జీవనోపాధి కల్పించింది.






**ఆమదాలవలస, ఆగస్టు 22 (వార్త):**

ఆమదాలవలస నియోజకవర్గం శాసనసభ్యులు కూన రవికుమార్ కు పార్టీలకు అతీతంగా పెద్ద ఎత్తున ప్రజలు అభిమానం చూపుతున్నారు. ఒక వ్యక్తి ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉంటే ప్రజాభిమానం తప్పక ఉంటుందని పెద్దలు చెప్పిన మాటకు సరైన ఉదాహరణ ఎమ్మెల్యే కూన రవి కుమార్ అనడంలో అతిశయోక్తి లేదు. ఆయన వద్దకు ఏదయినా పని కోసం వచ్చిన వారికి అర్హత ఉంటే చాలు.. పార్టీలకు అతీతంగా ఆ పనిని కాలయాపన లేకుండా పూర్తి చేయడం, అర్హత లేకుంటే ఎంతో ఓపికగా వారికి ప్రత్యామ్నాయ మార్గం చూపించడం ఇతని ప్రత్యేకత. ఆమదాలవలస నియోజకవర్గం ఎమ్మెల్యే కూన రవికుమార్.. ప్రతి క్షణం అభివృద్ధి దిశగా అడుగులేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు.

ఉదాహరణకు..ఇటీవల ప్రధానమంత్రి ఉచ్చతార్ శిక్ష అభియాన్ ద్వారా ఆమదాలవలస ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధి కోసం రూ.5 కోట్ల నిధులు తెప్పించడంలో ఎంతో కృషి చేశారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలకు కూడా విద్యను పూర్తి స్థాయిలో అందించేందుకు ఈ నెల 20 వ తేదీన ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబునాయుడు దృష్టికి పలు విద్యాభివృద్ధి పనులను తీసుకెళ్లారు. ఆమదాలవలస మండలంలోని తొగరాం, పొందూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల తో పాటు సరుబుజ్జిలి మండలం రొట్టవలస ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు శాశ్వత భవనములు, పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించేందుకు నిధులు ప్రకటించాలని ఆయన ముఖ్యమంత్రికి విన్నవించారు. అదే విధంగా బూర్జ మండలం నారాయణపురం ఆనకట్టు ఆధునికీకరణ పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చెయ్యాలని కోరారు. దీనిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సానుకూలంగా స్పందించారు. నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు.

2014 సంవత్సరంలో కూన రవికుమార్ ఎమ్మెల్యేగా గెలవడంతో పాటు ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు నిర్వహించి, వందలాది కుటుంబాలకు సొంతింటి కల నెరవేర్చారు. హుదూద్ తుఫాన్ వచ్చిన సమయంలో దేశ వ్యాప్తంగా ఎంతో నష్టం జరిగింది. ఆమదాలవలస నియోజకవర్గంలోనూ పంట నష్టం భారీగా జరిగింది. అయితే రైతులకు నష్ట పరిహారం అందించడంలో కూన రవికుమార్ ఎంతగానో కృషి చేసారు. అదే విధంగా 512 కుటుంబాలకు అతి తక్కువ కాలంలోనే పురపాలక సంఘం పరిధిలోని ఒకటో వార్డు తిమ్మాపురంలో సొంత ఇల్లు నిర్మించి వారి సొంత ఇంటి కలను తీర్చారు. దీంతో విద్యావంతుడు, మనసున్న వ్యక్తి కూన రవికుమార్ అధికారంలో ఉండడం వలనే ఇంత మందికి గూడు దొరికిందని అతనిని ఎంతగానో మెచ్చుకున్నారు. అదే విధంగా 2019 ఎన్నికలలో ఓటమి ఎదురైనప్పటికీ అయన వద్దకు వెళ్లి సాయం కోరిన ఏ ఒక్కరికీ కాదనకుండా సహాయం చేయడం ఆయన గొప్పతనమని ప్రజలు చెప్పుకుంటున్నారు. చదువుతో పాటు అతి తక్కువ వయసు నుండే రాజకీయాలపై అనుభవం ఉండడంతో క్షేత్రస్థాయి నుండి ప్రజల కష్టాలను అర్థం చేసుకుంటున్నారని మరికొందరు ఆయనను కొనియాడుతున్నారు. ఇక 2024 ఎన్నికల్లో అఖండ మెజార్టీతో తమ్మినేని సీతారాంపై కూన రవికుమార్ విజయం సాధించారు. ఎక్కడ కూడా ఆయన కాలయాపన చేయకుండా నియోజకవర్గ సమస్యలపై దృష్టి సారించారు. నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేసే దిశగా ఒక ప్రణాళిక ప్రకారం అడుగులు వేస్తున్నారు. శ్రీకాకుళం-ఆమదాలవలస ప్రధాన రోడ్డుపై దృష్టి సారించారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయ్యేందుకు తనవంతు కృషి చేస్తున్నారు. అలాగే మరికొన్ని శాశ్వత పనులు, ఇరిగేషన్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని దశల వారీగా పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నారు.. ఎమ్మెల్యే కూన రవికుమార్.





## మాజీ మంత్రి సీదిరిని కలిసిన అభ్యుదయం ప్రెస్ క్లబ్ సంఘం

**పలాస, ఆగస్టు 22 (వార్త):** కొత్తగా ఏర్పడిన అభ్యుదయం ప్రెస్స్ క్లబ్ సంఘము మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును మర్యాద పూర్వకంగా కలిశారు. గురువారం కాశీబుగ్గలోని ప్రగతి భవన్ కార్యాలయంలో సంఘం ప్రతినిధులు కలిశారు. ఈ సందర్భంగా సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ తాను జర్నలిస్టులకి వ్యతిరేకం కాదని, గత ఐదేళ్లుగా పలాస నియోజకవర్గంలోని జర్నలిస్టులకు అన్ని విధాలుగా సహకరించానని, ముందుకూడా అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయం సంఘం ప్రెస్ క్లబ్ నాయకులు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## జాహ్నవికి ప్రతిభా పురస్కారం



**హిరమండలం/ఎల్ఎన్‌పేట, ఆగస్టు22 (వార్త):**పాత హిరమండలం లోని నాయి బ్రాహ్మణ కులానికి చెందిన ఉప్పరాపల్లి జాహ్నవి రాజుకి నాయి బ్రాహ్మణ ప్రతిభా పురస్కారం లభించినట్లు శ్రీ లక్ష్మి గణపతి నాయి బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు తొత్తడిపూడి సాయి తెలిపారు. ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో జాహ్నవి అత్యదిక మార్కులు పొంది టాప్ -10 లో మొదటి స్థానం సాధించిందన్నారు. శ్రీకాకుళం లోని అంబేద్కర్ ఆడిటోరియం లో జిల్లా నాయి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పది, ఇంటర్, ఇంజనీరింగ్ తదితర కోర్సుల్లో ప్రతిభ కనపరిచిన తమ కులానికి చెందిన విద్యార్థులకు బుధవారం సన్మాన కార్యక్రమం నిర్వహించినట్టు తెలిపారు. జిల్లా రిజిస్ట్రార్ లెంకా వెంకటేశ్వర్లు చేతుల మీదుగా జాహ్నవికి ప్రతిభా పురస్కారంతో పాటు షీల్డు, నగదు బహుమతి అందజేసినట్లు సాయి చెప్పారు. ప్రముఖ గైనకాలజిస్ట్ డా. ఆర్.అరవింద్ తాను రచించిన జీనియస్ పుస్తకాన్ని జాహ్నవికి బహుమతిగా అందించారన్నారు. జాహ్నవి తో పాటు.. మిగిలిన తొమ్మిది మంది విద్యార్థులకు కూడా ప్రతిభా పురస్కారాలు అందజేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మల్కాపురం కనరావు, ఎఐజీ రవీంద్ర బాబు తుమ్మిడి బ్రదర్స్ అధినేత రామ్ కుమార్, ఇతర ప్రముఖులు పాల్గొన్నారని చెప్పారు. జాహ్నవి కి ప్రతిభ పురస్కారం రావడం పట్ల మండల నాయి బ్రాహ్మణ సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ జాహ్నవి స్ఫూర్తితో ప్రతి విద్యార్థీ ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు

## గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**కొత్తూరు, ఆగస్టు 22 (వార్త):** నివగాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్టు అధ్యాపకులుగా పనిచేయటానికి ఆసక్తి కల అభ్యర్థులు ఈ నెల 23వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డి. రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో గణితశాస్త్రం సబ్జెక్టులో ఖాళీలు ఉన్నాయని తెలిపారు. అర్హత కలిగిన పోస్టుగ్రాడ్యుయేషన్ కు సంబంధించిన సబ్జెక్టులో కనీసం 50 శాతం మార్కులు కలిగిన అభ్యర్థులు అర్హులన్నారు. అలాగే పాతపట్నం జూనియర్ కళాశాలలో ఆర్థిక శాస్త్రం సబ్జెక్టుకు సంబంధించిన అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పీజీలో ఉత్తీర్ణత, విద్యార్హతలను పరిగణనలోకి తీసుకుంటామన్నారు.

## పలు కుటుంబాలకు రెడ్డి శాంతి పరామర్శ

**కొత్తూరు, ఆగస్టు 22 (వార్త):** మండలం లోని ఓంద్రుజోల గ్రామనికి చెందిన వైసీపీ నాయకులు సంకు వరహాలింగం భార్య నిర్మల ద్విచక్ర వాహనం పైనుండి ప్రమాదవశాత్తు జారిపడి గాయాల పాలైంది. ఆమెను పాతపట్నం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బుధవారం పరామర్శించారు. అలాగే అదే గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు నిమ్మగడ్డ వరహాల నాయుడు ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను కలసి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. రెడ్డి శాంతి వెంట గ్రామ సర్పంచ్ ప్రతినిధి నాగేంద్ర, వైసీపీ నాయకులు లింగం ఉన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం





## ఎస్పీని కలిసిన సీఐలు

**శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 22 (వార్త):** ఆమదాలవలస, టెక్కలి అర్బన్ సర్కిల్ ఇన్స్పెక్టర్లుగా బాధ్యతలు చేపట్టిన పి.సత్యనారాయణ, ఏ.విజయ కుమార్ గురువారం శ్రీకాకుళం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మహే శ్వర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లా డుతూ శాంతిభద్రతల పరిరక్షణ తోపాటు,ట్రాఫిక్ నియంత్రణ, నేరాల నియంత్రణ కు తీసుకోవాల్సిన చర్యలు, విధులు, బాధ్యతలపై సీఐలకు దిశానిర్దేశం చేశారు.



### రోడ్డు నిర్మాణంలో..
# నాణ్యత పాటించండి

*** ఎమ్మెల్యే గొండు శంకర్ * శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డు పనుల పరిశీలన**

**శ్రీకాకుళం టౌన్ ఆగస్టు22 (వార్త):** శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ కాంట్రాక్టర్‌కు సూచించారు. శ్రీకాకుళం నుంచి ఆమదాలవలసకు నిర్మాణం అవుతున్న రోడ్డు పనులను రాగోలు వద్ద గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం ఏర్పడిన కొద్ది నెలల్లోనే నిర్మాణ పనులు చేపడుతుండడం ఆనందంగా ఉందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడం వల్ల అనేకమంది తమ ప్రాణాలను కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి





ప్రభుత్వం రోడ్డు పనులను అసంపూర్తిగా వదిలేయడంతో వాహనదారులు నానాఅవస్థలు ఎదుర్కొన్నారన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో వారు తమ ఆగ్రహాన్ని చూపించారని తెలిపారు. ప్రజల కనీస అవసరాలను కూడా వైసిపి ప్రభుత్వం తీర్చలేక పోయిందని చెప్పారు. అభివృద్ధిని పూర్తిగా విస్మరించి ప్రజలతో ఆడుకుందని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలకు అవసరమైన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. కొద్ది నెలల్లోనే రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేస్తామన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### కొత్త వంగడాలను సృష్టించాలి

వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు అధిక దిగుబడులు వచ్చేలా చూడాలని, అందుకు కొత్త వంగడాలను సృష్టించాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శ్రీకాకుళం ఆమదాలవలస రోడ్డులో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రాన్ని గురువారం శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు బాగుంటేనే దేశం బాగుంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల బాగుకోసం ఎంతగానో కృషిచేస్తున్నదని తెలిపారు. సీఎం చంద్రబాబునాయుడు, వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుల ఆధ్వర్యంలో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. కొరత లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు చెప్పిన సలహాలు, సూచనలు పాటిస్తూ అధిక దిగుబడులు సాధించి, ఆర్థికంగా బలోపేతమవ్వాలని రైతులకు సూచించారు. జిల్లాలోని నేలలు ఉధ్యాన పంటలకు ఎంతో అనుకూలంగా ఉన్నాయన్నారు. జిల్లా రైతులు వాణిజ్య పంటలతో పాటు ఉద్యాన పంటలు వేసుకుంటే అధిక లాభాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. కొత్త తోటల పెంపకానికి ప్రభుత్వం సబ్సిడీ కూడా అందిస్తుందని వివరించారు. రైతులు తమ కావాల్సిన మొక్కల కోసం సంబంధిత ఉధ్యానశాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ పంటలు వేసి రైతన్నలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలని కోరారు. రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని పేర్కొన్నారు.

# హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

*** పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్**

**పలాస, ఆగస్టు 22 (వార్త):** సంక్షేమ హాస్టల్ విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.యస్.యు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం పలాస సూది కొండ కాలనీలోని న్యూడెమోక్రసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ 1071, ఎస్టీ 640, బీసీ 1152, మైనార్టీ 118 సంక్షేమ హాస్టల్ లలో సుమారుగా ఆరు లక్షల మంది విద్యార్థులు ఉన్నారన్నారు. ప్రభుత్వం 5 వ తరగతి నుండి 10వ తరగతి వరకు నెలకు 1400 రూపాయలు, ఇంటర్, డిగ్రీ ,పిజీ విద్యార్థులకు 1600 రూపాయలు మెస్ చార్జీలు ఇస్తున్నారని తెలిపారు. పూటకు 15 రూపాయల నుండి 17 రూపాయల మధ్యలో మెస్ చార్జీలు ఇస్తున్నారని, మార్కెట్లో నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. ఏళ్ల తరబడిగా సంక్షేమ హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలను ప్రభుత్వాలు పెంచడం లేదన్నారు. ప్రభుత్వ నివేదికల ప్రకారం ఒక విద్యార్థి ఆరోగ్యవంతంగా ఉండాలంటే 2600 క్యాలరీల శక్తి అవసర మన్నారు. ఈ చాలీచాలని మెస్ చార్జీలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా రన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా సంక్షేమ హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలను నెలకు 3000 రూపాయలకు పెంచాలని, ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులను, ఏడు



నెలలుగా పెండింగ్‌లో ఉన్న కాస్మొటిక్ చార్జీలను వెంటనే విడుదల చేయాలన్నారు. సంక్షేమ హాస్టల్ లో ఖాళీగా ఉన్న కుక్, కమాటి, వాచ్మెన్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. ఏజెన్సీలో ఉన్న హాస్టల్‌కు దోమతెరలను పంపిణీ చేయాలని, హాస్టల్స్‌లో మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో పి.డి.యస్.యు నాయకులు అర్జున్, సందీప్, శివాజీ, పవన్, ప్రవీణ్, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు హెచ్‌బీ పరీక్షలు

**సంతబొమ్మాళి, ఆగస్టు 22 (వార్త):** కొల్లిపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గురు వారం హిమోగ్లోబిన్ పరీ క్షలు నిర్వహించారు. బోరుభద్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకు హెచ్.బి. పరీ క్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని ఉపాధ్యాయుడు వి.పార్వ తీశం అన్నారు.



## రోడ్డు పనులకు శంకుస్థాపన

**పలాస, ఆగస్టు 22 (వార్త):** పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని ఆంధ్రా బ్యాంకు రోడ్డు నిర్మాణానికి మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఉన్న ఆంధ్ర బ్యాంకు రోడ్డు లోని కొంత స్థలం గత కొన్ని ఏళ్లగా ఆక్రమణకు గురైందని ఇటీవల కోర్టు ఆదేశాల మేరకు ఆక్రమణలు తొలగించి యుద్ధ ప్రాతిపదికన 5 లక్షల రూపాయలతో రోడ్డు పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఆంధ్ర బ్యాంక్ రోడ్డు అత్యంత విశాలమైన రహదారిగా ఉందని ఆక్రమణల వలన కొంత ప్రాంతం విడిచిపెట్టి రహదారి నిర్మాణం చేపట్టామన్నారు. నేడు ఆక్రమణ రహదారి నిర్మాణం కూడా పూర్తిచేసి విశాలవంతమైన రహదారిగా రూపుదిద్దుకోనుందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్ర కుమార్, కౌన్సిలర్ పప్పల ప్రసాద్, పలువురు కాంట్రాక్టర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామ సభల్లో అభివృద్ధి పనులు గుర్తించాలి



**పలాస, ఆగస్టు 22 (వార్త):** ప్రతి సచివాలయం పరిధిలో గ్రామ సభలు నిర్వహించి పనులు గుర్తించాలని ఎంపీడీవో ఎన్ రమేష్ నాయుడు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శి ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సచివాలయాన్ని స్వర్ణ సచివాలయంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. 22 రకాల పనుల్లో భాగంగా ఇప్పటి వరకు ఎన్ని పనులు గుర్తించారు, ఇంకా ఎన్ని పనులు చేయాల్సి ఉంది సచివాలయ పరిధిలో గ్రామ సభలు నిర్వహించి తీర్మానం చేయాలన్నారు. ప్రతి సచివాలయం గ్రామ సభకు మండల స్థాయి అధికారులను ప్రత్యేక అధికారిగా నియమించడం జరిగిందన్నారు. గ్రామ సభలను తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో పంచాయతీ విస్తరణ అధికారి మెట్ట వైకుంఠరావు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## డాక్టర్ ముత్యంకు జన జాగృతి నివాళి




**పలాస, ఆగస్టు 22 (వార్త):** జన జాగృతి సాహితీ సమాఖ్య అధ్య క్షులు డాక్టర్ కుమార్ నాయక్ అధ్యక్షతన గురువారం పలాస ప్రభుత్వ డిగ్రీ కళా శాలలో ప్రముఖ విప్లవోద్యమ రచయిత, బహు గ్రంథకర్త,సామాజిక విమర్శకుడు, డాక్టర్ ముత్యంకు జన జాగృతి సమాఖ్య నివాళులు అర్పించింది. సమాఖ్య వ్యవస్థాపకుడు డాక్టర్ తెప్పల కృష్ణమూర్తి తన కవిత ద్వారా డాక్టర్ ముత్యంకు శ్రీకాకుళం జిల్లాతో గల అనుబంధాన్ని, సమగ్రంగా తెలియజేశారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ సమాజంలో జాగృతి పరిచే సంస్థలు నిత్యము మంచి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జన జాగృతి అధ్యక్షుడు కుమార్ నాయక్, కోశాధికారి బాలకృష్ణ వర్మ, కళాశాల లెక్చరర్ పి.మధు, లైన్స్ క్లబ్ అధ్యక్షుడు హెచ్.వై.దొర, కోశాధికారి ఎన్.అప్పారావు, లయన్ పి.వెంకట్రావు, లయన్ కె.పి. రామన్న, డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ అంతరాయం

**పలాస, ఆగస్టు 22 (వార్త):** పలాస మండలం బొడ్డపాడు సబ్ స్టేషన్ 11 కె.వి మాకన్నపల్లి ఫీడర్ పరిధిలో చెట్లు తొలగింపు కార్యక్రమం చేపడుతున్న దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు మాకన్నపల్లి, చిన్న నీలావతి, పెద్ద నీలావతి, కొత్త ఊరు, గురుదాస్ పురం, మామిడి మెట్టు, రంగోయి తదితర గ్రామాల్లో విద్యుత్ అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఈఈ యోగేశ్వరరావు తెలిపారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## రోడ్డు ప్రమాదంలో కుమ్మరిగుంట యువకుడు మృతి



**సారవకోట, ఆగస్టు 22 (వార్త):** సారవకోట మండలానికి చెందిన యువకుడు విజయవాడలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే సారవకోట మండలం కుమ్మరిగుంట గ్రామానికి చెందిన సాధు సంతోష్ కుమార్ (23) హైదరాబాదులోని ఓ స్టూడియోలో పనిచేస్తున్నాడు. కొత్తగా ద్విచక్ర వాహనం కొనుగోలు చేసిన అతను విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకుని తిరిగి వెళుతుండగా ప్రమాదానికి గురయ్యాడు. ఈ నేపథ్యంలో కుమ్మరిగుంట గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతి చెందిన సంతోష్ కుమార్‌కు తల్లిదండ్రులు ఉన్నారు.

# ఇసుక అక్రమంగా తరలిస్తే.. టోల్ ఫ్రీకి ఫిర్యాదు చేయండి






*** అక్రమ రవాణాపై 18004256012, 9701691657 సమాచారమివ్వండి * ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకే రవాణా * ఇసుక టన్ను రూ.340 * ముందుగా స్లాట్ బుక్ చేసుకోవాలి * స్టాక్ యార్డుల వద్ద చెక్‌పోస్టులు * రిజిస్ట్రేషన్ లేని వాహనాల్లో ఇసుక తరలిస్తే సీజ్ * రాత్రివేళ ఇసుక తరలింపు నిషేధం * జిల్లా కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్**

**శ్రీకాకుళం, ఆగస్టు 22 (వార్త):** జిల్లాలో ఉచిత ఇసుక కార్యకలాపాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు పటిష్ట ప్రణాళిక సిద్ధం చేశామని జిల్లా కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ఇసుకపై ఫిర్యాదులకు 18004256012 టోల్ ఫ్రీ నెంబర్, 9701691657 వాట్సాప్ నంబర్ 24 గంటలూ పనిచేస్తాయని చెప్పారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కలెక్టర్‌తో పాటు ఎస్పీ కేవీ మహేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. జిల్లాలో ప్రస్తుతం కొత్తూరు మండలం అంగూరు వద్ద స్టాక్ యార్డ్ ఏర్పాటు చేశామని, అక్కడికి వచ్చే ట్రక్కులలోకి ఇసుకను లోడ్ చేయబోయే తేదీ, సమయాన్ని సరిగ్గా పేర్కొంటూ బుకింగ్ రశీదును జారీ చేస్తామని చెప్పారు. ప్రతి కేటగిరీ వాహనంపై కిలో మీటరుకు, మెట్రిక్ టన్నుకు రవాణా ఛార్జీలను ఖరారు ఖరారు చేశామన్నారు. ఇసుక రవాణా చేసే వాహనాలు తప్పనిసరిగా ఆర్టీవో కార్యాలయంలో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ పూర్తిగా ఉచితమని, రిజిస్ట్రేషన్ లేని వాహనాలు సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. ఇసుక రవాణాకు సంబంధించి రవాణాదారులు ఎలాంటి ఉల్లంఘనలు చేసినా అన్ని సంబంధిత శాఖలు కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. స్టాక్ యార్డు వద్ద ఎటువంటి వాహనం అనవసరంగా వేచి ఉండకుండా చూస్తామని, ఇసుక కార్యకలాపాలను ఎలాంటి ఆటంకాలు లేకుండా పర్యవేక్షించేందుకు స్టాక్ యార్డులకు సమీపంలో రెవెన్యూ/పోలీస్/పంచాయతీలతో కూడిన ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్ పాయింట్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అంగూరు, సోమరాజుపురం లో సచివాలయంలో బుకింగ్ కేంద్రం సిద్ధం చేశామని, ఈ బుకింగ్ కేంద్రంలో ముందుగా స్లాట్‌బుక్ చేసుకోవాలని, ప్రతీ స్లాట్‌లో రెండేసి గంటలకు సమయం కేటాయించి కనీసం 15 వాహనాలకు లోడింగ్ అనుమతి ఇస్తామని, బుకింగ్ కేంద్రం ఉదయం 6 గంటల నుండి సాయంత్రం ఆరు గంటల వరకూ మాత్రమే పని చేస్తుందన్నారు. రాత్రి వేళల్లో ఇసుక రవాణా నిషేధించామని స్పష్టం చేశారు. లోడింగ్, ఇతర ఖర్చులు కలుపుకొని ఇసుకను టన్ను రూ.340 ధర నిర్ధారించినట్లు చెప్పారు. పది మెట్రిక్ టన్నులకు 10 కిలోమీటర్ల పరిధిలో రూ.1633 రవాణా చార్జీలను నిర్ణయించామని, 15 కిలోమీటర్ల పరిధికి రూ.2035, 20 కిలోమీటర్ల పరిధికి రూ.2438, 35 కిలోమీటర్ల పరిధికి రూ.3668 చొప్పున ధరను నిర్ధారించినట్లు వివరించారు. ఇసుక అక్రమ రవాణా అరికట్టడం కోసం పైడిభీమవరంలో నిరంతరాయంగా పనిచేసేలాగా చెక్ పోస్ట్ ను ఏర్పాటు చేశామని కలెక్టర్ వివరించారు. ఈ విలేకరుల సమావేశంలో మైన్స్ ఉప సంచాలకులు సత్యనారాయణ పాల్గొన్నారు.

# కోడిరామ్మూర్తి స్టేడియం పనుల్లో.. కదలిక

*** అత్యాధునిక హంగులతో నిర్మాణం**
*** త్వరలోనే క్రీడాకారులకు అందజేస్తాం**
*** పనులు పరిశీలించిన శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్**

**శ్రీకాకుళం టౌన్ ఆగస్టు 22 (వార్త):** శ్రీకాకుళం జిల్లాకే తలమానికంగా నిలిచే కోడిరామ్మూర్తి స్టేడియం నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని కోడిరామ్మూర్తి స్టేడియం నిర్మాణ పనులను ఎమ్మెల్యే గొండు శంకర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటకు కట్టుబడి అత్యాధునిక హంగులతో స్టేడియం నిర్మాణ పనులను ప్రారంభించామని కొద్ది నెలల్లోనే దీనిని పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తెస్తామన్నారు. కోడిరామ్మూర్తి స్టేడియం నిర్మాణంపై గత వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసిందని తెలిపారు. ఏడాదిలో పనులు పూర్తిచేస్తామని హామీ ఇచ్చి మాట తప్పిందని విమర్శించారు. ఐదేళ్లలో ఒక్క ఇంచీ కూడా నిర్మాణం ముందుకుసాగలేదని దీంతో ఆడుకునేందుకు మైదానం లేక క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో శ్రీకాకుళం నగర నడిబొడ్డున జిల్లాకు చెందిన మల్లయోధుడు కోడిరామ్మూర్తి పేరిట స్టేడియాన్ని నిర్మించారన్నారు. ఈ స్టేడియంలో ఎందరో క్రీడాకారులు శిక్షణ పొంది జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని తెలిపారు. ఈ స్టేడియం శిథిలావస్థకు చేరుకోవడంతో ఏడేళ్ల కిందట అప్పటి టీడీపీ ప్రభుత్వం ఆధునికీకరణకు శ్రీకారం చుట్టిందని వివరించారు. 2016లో అప్పటి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్‌నాయుడు చొరవతో నాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్టేడియం పనులకు శంకుస్థాపన చేశారని వివరించారు. మొత్తం రూ.9కోట్ల నిధులు కేటాయించి పనులు ప్రారంభించారని, రూ.7.53 కోట్ల విలువైన పనులను కాంట్రాక్టరు పూర్తి చేశారని పేర్కొన్నారు. ఈ మేరకు రూ.4.73 కోట్ల బిల్లులు కూడా అందజేశారని, ఇంకా రూ.2.80 కోట్లు కాంట్రాక్టర్‌కు రావల్సి ఉందని చెప్పారు. స్టేడియం పూర్తవుతుందన్న తరుణంలో 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని ఏడాదిలో ఈ పనులు పూర్తిచేస్తామని హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం.. ఐదేళ్లయినా పూర్తి చేయలేకపోయిందని ఎద్దేవా చేశారు. రెండేళ్ల కిందట జిల్లాలో జరిగిన సభలో అప్పటి సీఎం జగన్ పాల్గొని స్టేడియం నిర్మాణానికి మరో రూ.12 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారని దీంతో మంత్రులు, సీనియర్ నాయకులు జగన్ చిత్రపటానికి పాలాభిషేకం సైతం చేశారని గుర్తు చేశారు. కానీ, పనులు మాత్రం ముందుకు కదల్లేదని మళ్లీ ఎన్నికల సమయంలో క్రీడాకారుల నుంచి సానుభూతిని పొందేందుకు పనులు చేయిస్తున్నట్లు హడావుడి చేశారని విమర్శించారు. స్టేడియం లేకపోవడంతో ఇతర ప్రాంతాల్లో క్రీడాకారులు తర్ఫీదు పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో మాదిరిగానే ఆరు గేట్లు, ఆధునాతన గ్యాలరీ సౌకర్యంతో త్వరితగతిన పనులు పూర్తిగా చేసి క్రీడాకారులకు స్టేడియాన్ని అందుబాటులోకి తెస్తామని చెప్పారు. ఎమ్మెల్యే శంకర్‌తో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఆర్అండ్‌బీ అధికారులు, డీఎస్‌డీఓ, క్రీడాకారులు పాల్గొన్నారు.



Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413